# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 22 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## బుద్ధ భవన్ పక్కనే హైడ్రా పోలీసు స్టేషన్.

- కార్యాలయ ఏర్పాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బుద్ధభవన్ పక్కనే వున్న భవనంలో హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా హైడ్రా పోలీసు స్టేషన్ భవనాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. హైడ్రా పోలీసు స్టేషన్లో కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. పోలీసు స్టేషన్ తరహాలోనే లోపల గదులు, కేబిన్ల నిర్మాణాలు వుండాలని సూచించారు. స్టేషన్ అధికారుల క్యాబిన్లతో పాటు ఫిర్యాదు దారులకు కల్పించాల్సిన వసతులపై సమీక్షంచారు. హైడ్రా పోలీసు స్టేషన్ సైన్ బోర్డులు ప్రముఖంగా కనిపించేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. పోలీసు స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల వాహనాల పార్కింగ్ సౌకర్యం వుండేలా ఏర్పాటు చేయాలన్నారు.



- తొలి విడతలో కామారెడ్డి జిల్లాలో ఏర్పాటు
- బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌కు సంసిద్ధత
- రాకెట్ తయారీ కోసం స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి
- దిగ్గజ కంపెనీ యూనిలీవర్ తో కీలక ఒప్పందం
- దావోస్ ఎకనామిక్ సదస్సులో రెండో రోజు ఒప్పందాలు

# తెలంగాణలో పామాయిల్ తయారీ యూనిట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం లో మరో దిగ్గజ కంపెనీ యూనిలీవర్ తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. కామారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ ఉత్పత్తి కేంద్రం, మరోచోట బాటిల్ క్యాప్ లను తయారు చేసే యూనిట్ ను ఏర్పాటు చేయనుంది. ఎఫ్ఎంసీజీ రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన యునిలీవర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యుటివ్ ఆఫీసర్ హెయిన్ షుమాకర్, చీఫ్ సప్లయి చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్ తో ముఖ్యమంత్రి , పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రిపిన చర్చల అనంతరం ఈ మేరకు ఒప్పందం కుదిరింది.

దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ వ్యూహాత్మక కేంద్రంగా ఉంటుందని, విస్తృత మార్కెట్ కు మిగతా రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు వివరించారు. పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న సానుకూల పరిస్థితులను ముఖ్యమంత్రి గారు వారితో పంచుకున్నారు. దేశంలో యూనిలీవర్ కు పలుచోట్ల కేంద్రాలు ఉన్నప్పటికీ తెలంగాణలో విస్తరించలేదని, వినియోగ వస్తువులకు రాష్ట్రంలో భారీ మార్కెట్ ఉందని, ఇక్కడి సులభతర వ్యాపార విధానాలు తయారీ సంస్థలకు అదనపు బలంగా ఉంటాయని ముఖ్యమంత్రి చెప్పారు.

యూనిలీవర్ సీఈవో షుమాకర్ గారు మాట్లాడుతూ, తెలంగాణలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీంతో పాటు బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేయడానికి కొత్త తయారీ యూనిట్‌ను నెలకొల్పడానికి వారు అంగీకరించారు. ప్రస్తుతం యూనిలీవర్ సంస్థ తమ ఉత్పత్తుల బాటిల్ క్యాప్‌లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుం టోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే బాటిల్ క్యాప్ యూనిట్‌ను నెలకొల్పడం ద్వారా వాటి కొరతను అధిగమించవచ్చు. రాష్ట్రంలో యూనిలీవర్ విస్తరణకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తామని, పామాయిల్ యూనిట్ ఏర్పాటుకు కామారెడ్డి జిల్లాలో అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు.

### రాష్ట్ర ప్రభుత్వంతో స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ ఒప్పందం

ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక రంగంలోని కంపెనీ స్కైరూట్‌తో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకాలు చేశారు.ఒప్పందం ప్రకారం స్కైరూట్ కంపెనీ తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇందుకోసం కంపెనీ దాదాపు రూ. 500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ఒప్పందం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ అత్యాధునిక సాంకేతిక అంతరిక్ష రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉందని




అన్నారు. తెలంగాణకు చెందిన యువకులు ప్రపంచంలోనే అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించటంతో పాటు, రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చినందుకు అభినందించారు.

స్కైరూట్ కంపెనీతో ప్రభుత్వ భాగస్వామ్యం అంతరిక్ష రంగంపై తమ వ్యూహాత్మక దృష్టిని చాటిచెపుతుందని శ్రీ శ్రీధర్ బాబు గారు అన్నారు. త్వరలోనే హైదరాబాద్ ప్రైవేట్ రంగ అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పెట్టుబడులు పెట్టడం సంతోషంగా ఉందని స్కై రూట్ కో-ఫౌండర్ పవన్ కుమార్ చందన గారు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్, హైదరాబాద్ రైజింగ్ లక్ష్య సాధనలో భాగం పంచుకుంటామని చెప్పారు.

## హైదరాబాద్‌లో కిడ్నీ రాకెట్ గుట్టురట్టు..!

- సరూర్‌నగర్‌లో అలకానంద ఆస్పత్రిలో అనుమతులు లేకుండా కిడ్నీ మార్పిడీలు
- పోలీసులకు వచ్చిన సమాచారంతో ఆస్పత్రిలో తనిఖీలు
- డీఎంహెచ్‌వోతో పాటు ప్రైవేట్ ఆస్పత్రిలో పోలీసుల సోదాలు
- నలుగురిని గాంధీ ఆస్పత్రికి తరలింపు.




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కిడ్నీ రాకెట్ గుట్టురట్టు అయింది. సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకానంద ఆస్పత్రిలో ఎలాంటి అనుమతులు లేకుండా కిడ్నీ మార్పిడిలు చేస్తున్నట్లు వైద్యాధికారులు, పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు ఎల్బీనగర్ ఏసీపీ కష్ణయ్య వివరాలు వెల్లడించారు. సరూర్ నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకానంద హాస్పిటల్ యాజమాన్యం కిడ్నీ రాకెట్ నడుపుందన్న సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా వైద్యాధికారులు పోలీసులు సహకారంతో ఆస్పత్రిలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వైద్యులతో హాస్పిటల్ యాజమాన్యం కుమ్మక్కై ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి అమాయకులను తీసుకొచ్చి కిడ్నీ రాకెట్‌కు పాల్పడిందని తెలిపారు. అమాయకులు పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని హాస్పిటల్ యాజమాన్యం ఈ దుర్మార్గానికి పాల్పడిందని చెప్పారు.

ఆసుపత్రి లోపల నలుగురిని గుర్తించిన పోలీసులు వారికి కిడ్నీ శస్త్ర చికిత్స జరిగినట్టు పోలీసులు గుర్తించారు. వారిలో ఇద్దరు దాతలుగా భావిస్తున్నారు. మరో ఇద్దరు గ్రహీతలుగా భావిస్తున్నారు. వీరు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారుగా గుర్తించారు. వీరు ఈ నెల 17 న ఆసుపత్రిలో చేరినట్టు అధికారులు తెలిపారు. వారిని ప్రశ్నించగా తాము కిడ్నీలో రాళ్ల తీసుకోవడానికి వచ్చినట్టు తెలిపారు. కానీ అధికారుల పరిశీలనలో మాత్రం వారికి కిడ్నీ శస్త్ర చికిత్సలు జరిగినట్టు అనుమానాలు వ్యక్తమయ్యాయి. నలుగురికి కిడ్నీ మార్పిడి జరిగిందా అనే విషయాన్ని శాస్త్రీయంగా నిర్ధారించేందుకు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అలకనంద ఆసుపత్రిని సీజ్ చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసుపత్రి ఎండీ సుమంత్ చారీ, ఆసుపత్రి సిబ్బందిని అరెస్ట్ చేసినట్టు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు.

## జమిలీ ఎన్నికలపై 31న జేపీసీ రెండో సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రతిపాదనలకు సంబంధించిన బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ రెండో సమావేశం ఈ నెల 31న జరుగనున్నది. ఈ మేరకు లోక్‌సభ అధికారిక వెబ్‌సైట్‌లో సమావేశం వివరాలు పబ్లిష్ అయ్యాయి. రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) బిల్లులను గత శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ లో ప్రవేశపెట్టారు. బిల్లులను పరిశీలించాలని కమిటీకి సూచించారు. జేపీసీ తొలి సమావేశం ఈ నెల 8న జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ప్రతిపాదిత చట్టాల నిబంధనలను కమిటీకి న్యాయ మంత్రిత్వశాఖ ప్రతినిధులు, అధికారులు వివరించారు.సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు చట్టాల సవరణను రాజ్యాంగం, సమాఖ్యవాదం ప్రాథమిక స్ఫూర్తిపై దాడిగా అభివర్ణించారు. కమిటీకి బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. 39 మంది సభ్యుల కమిటీలో కాంగ్రెస్‌కు చెందిన ప్రియాంక గాంధీ, జనతాదళ్ (యూ)కు చెందిన సంజయ్ ఝా, శివసేనకు




చెందిన శ్రీకాంత్ షిండే, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి సంజయ్ సింగ్, కల్యాణ్ బెనర్జీ, సాకేత్ గోఖలే (టీఎంసీ) ఉన్నారు. జమిలీ ఎన్నికలకు సంబంధించిన రెండు ముసాయిదా బిల్లులను పరిశీలించేందుకు రాజకీయ పార్టీలు సుముఖత వ్యక్తం చేయడంతో కమిటీ సభ్యుల సంఖ్యను కేంద్రం 39కి పెంచింది. కమిటీలో మాజీ కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, పర్షోత్తమ్ రూపాలా, మనీష్ తివారీ, ఎంపీలు అనిల్ బలూని, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రా ఉన్నారు. కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### 27 మంది మావోయిస్టులు హతం





- మృతుల్లో టాప్ కమాండర్ జయరామ్ అలియాస్ చలపతి
- చంద్రబాబుపై అలిపిరి దాడి ఘటనలో సూత్రధారి.. అతనిపై రూ. కోటి రివార్డు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో మావో యిస్టులకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఒడిశాలోని నౌపడా జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబాద్ జిల్లా మైనాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పుల్వాడి ఘాట్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో భద్రతా దళాలతో జరిగిన ఎదురు కాల్పులో 27 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. మరి కొంత మందికి తీవ్రగాయాలవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు 20 మంది మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కాల్పులు కొనసాగు తున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో సీనియర్ నక్సల్స్ కమాండర్ జయరామ్ అలియాస్ చలపతి చనిపోయాడని, అతనిపై కోటి రూపాయల రివార్డు ఉన్నదని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

ముందుకు మావోయిస్టులను చుట్టుముట్టిన కోబ్రా సైనికులు, వెంటనే లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ మావోయిస్టులు పెద్ద ఎత్తున ఎదురు కాల్పులు జరుపుతున్నట్లు సమాచారం. ఘటనా స్థలంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేశాయి.

ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దులోని జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మంగళవారం హతమయ్యారు. వీరిలో రూ.1కోటి రివార్డ్ నక్సల్ చలపతి కూడా ఉన్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా జనవరి 19 రాత్రి ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు అధికారి తెలిపారు. జిల్లా రిజర్వ్ గార్డ్ , సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ , ఛత్తీస్‌గఢ్ కోబ్రా, ఒడిశా స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ , భద్రతా సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 20 మంది నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని గరియాబాద్ ఎస్?పీ నిఖిల్ రఖేచా తెలిపారు. అందులో కోటి రూపాయల రివార్డు ఉన్న నక్సలైట్ కేంద్ర కమిటీ సభ్యుడు జయరామ్ అలియాస్ చలపతి మృతదేహం కూడా ఉందని చెప్పారు.

## నక్సలిజం కొన ఊపిరితో ఉన్నది

నక్సల్ ఫ్రీ భారత్ లక్ష్యం

కేంద్ర హెూంమంత్రి అమిత్ షా


వివరాలు 2వ పేజీలో




## భూ కబ్జాకు పాల్పడుతున్నారంటూ వ్యక్తిపై ఈటల దాడి

- మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఘటన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీజేపీ ఈటల రాజేందర్ ఓ వ్యక్తిపై చేయి చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఈ ఘటన చోటు చేసుకుంది. మున్సిపాలిటీలోని ఏకశిలానగర్‌లో మంగళవారం ఈటల రాజేందర్ పర్యటించారు.స్థానికులను కొందరు బెదిరిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న ఎంపీ ఈటల రాజేందర్ తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. అక్కడ కొందరు వీడియోలు తీస్తూ ఎంపీని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఈటల రాజేందర్ అక్కడ కాపలాదారుడిగా పనిచేస్తున్న ఎండీ రఫీని చెంపదెబ్బ కొట్టాడు. వెంటనే అక్కడే ఉన్న బీజేపీ శ్రేణులు కూడా ఒక్కసారిగా అతనితో పాటు మరొకరిపై పిడిగుద్దులతో గుప్పిస్తూ దాడికి పాల్పడ్డారు. గాయపడిన వ్యక్తులు తీవ్ర గాయాలతో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిలోకి అకారణంగా తన అనుచరులతో రావడమే కాకుండా తమపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, ఎంపీతో పాటు బీజేపీ నాయకులు, ఈటల అనుచరులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.


ఈ ఘటనపై ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల బతుకులకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. అంతకు ముందు పంచాయతీ నుంచి గృహ నిర్మాణ అనుమతులు లభించాయని, పేదలు ఇండ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గృహ నిర్మాణ అనుమతులు నిలిపివేయటం దారుణమన్నారు. పేదల పక్షాన నిలబడాల్సిన పోలీసులు మోసగాళ్లకు ఎలా సహకరిస్తారని ప్రశ్నించారు. పేదలు వారి స్థలాలు కోల్పోయి ఇబ్బందులు పడుతుంటే వారికి మద్దతుగా నిలువాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మరిన్ని ఇబ్బందులు పెడుతున్నదని ఆరోపించారు. ప్లాట్ల యజమానులకు తాను అండగా ఉంటానని, ఎవరు వచ్చినా ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడుతున్న బిల్డర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రాచకొండ సీపీ సుధీరా బాబుకు ఫోన్‌లో కోరారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మండల అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్, ప్లాట్ల యజమానులు తదితరులు ఉన్నారు.

### ఈటల రాజేందర్‌పై కేసు నమోదు

ఎంపీ ఈటల రాజేందర్‌పై కేసు నమోదైంది. ఏకశిలనగరంలో సెక్యూరిటీ డ్యూటీలో ఉండగా తనపై దాడి చేశారని గ్యార ఉపేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోచారం పోలీసులు ఈటల రాజేందర్‌పై కేసు నమోదు చేశారు. ఈటలతోపాటు దాడికి పాల్పడిన మరో 30 మందిపైనా కేసు నమోదైంది. ఈటలతోపాటు ఏనుగు సుదర్శన్ రెడ్డి, శివారెడ్డి, బస్వరాజ్, ఐబైర్ అక్రమ్ లపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## గ్రామ సభల్లో రసాభాస

- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికపై భగ్గుమన్న ప్రజలు
- పథకాల అమలు జాబితాలపై నిలదీతలు, నిరసనలు
- అనర్హుల పేర్లు ఉన్నాయంటూ స్థానికుల ఆగ్రహం





**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న ప్రజాపాలన గ్రామసభలు రసాభాసగా సాగాయి. నాలుగు సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం నిర్వహించిన సభల్లో కొన్ని చోట్ల కొద్దిపాటి నిరసన వ్యక్తమవ్వగా.. మరికొన్ని చోట్ల స్థానికుల ఆగ్రహం, నిలదీతలతో ముగి శాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వంటి నాలుగు పథకాలపై అర్హుల పేర్లను ఎంపిక చేసేందుకు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. అయితే, అనర్హుల పేర్లు ఉన్నాయని, తమకు అన్యాయం జరుగు తోందంటూ పలుచోట్ల గ్రామస్తులు అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా పానగల్ మండలంలో 10 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలకు జిల్లా డీఆర్డీఓ, పానగల్ ప్రత్యేక అధికారి ఉమాదేవి హాజరయ్యారు. అన్నారం, తెల్లరాళ్లపల్లి గ్రామంలో అనర్హులను ఎంపిక చేశారంటూ నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను భూమిలేని వారికి కాకుండా.. భూమి ఉన్నవారికి, ఉపాధి పని చేయని వారికి మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నారం తండాలో జరిగిన గ్రామ సభలో ఎలాంటి వసతులు, నీడకు టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే నిలబడి నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చౌదరిగూడ సభలో గందరగోళం నెలకొంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అనర్హులను ఎంపిక చేశారని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఉపాధి హామీ పనిచేయని వారిని, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రమేష్ స్పందిస్తూ.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, గ్రామసభ కంటే ముందే వారి పేర్లను తిరస్కరించినట్టు తెలిపారు. మహేశ్వరం మండలం అమీర్‌పేట సభలో ఆరు గ్యారంటీలపై ప్రజలు అధికారులను నిలదీశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, లష్కర్‌గూడ గ్రామసభ రసాభాసగా సాగింది. అనర్హుల పేర్లు రేషన్ కార్డు లిస్ట్‌లో వచ్చాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మున్సిపల్ పరిధి, మండల పరిధిలో ప్రజాపాలన కార్యక్రమంలో


మిగితా 2వ పేజీలో


## 71 శాతం నీటివాటా ఇవ్వాలి

- కేఆర్ఎంబీలో తెలంగాణ డిమాండ్
- 50:50 నిష్పత్తిని అంగీకరించం : ఏపీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కృష్ణా జలాల్లో తెలంగాణకు 71 శాతం వాటాను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఇప్పటిదాకా ఇస్తున్న 66:34 శాతం నిష్పత్తిని వ్యతిరేకించింది. రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాంతం 71 శాతం ఉంది. ఇది ఖరారు చేసేవరకు చెరిసగం వాటా ఇవ్వాలని కోరింది. కృష్ణా నది యాజమాన్య బోరు (కేఆర్ఎంబీ) సమావేశం చైర్మెన్ అతుల్‌జైన్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు, ఇంజినీర్లు, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల విడుదల , ఇప్పటివరకు వినియోగం, జలాశయాల్లో నిల్వలు, కృష్ణా పరివాహకంలో టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు, శ్రీశైలం జలాశయాల ఆనకట్టల మరమ్మతులు, బోర్డుకు నిధుల కేటాయింపు, రెండు రాష్ట్రాలు నిర్మిస్తున్న ప్రాజెక్టులపై పరస్పర ఫిర్యాదులు తదితరాలపై చర్చ జరిగింది. భేటీ అనంతరం తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా జలసౌధలో మీడియాతో మాట్లాడుతూ కృష్ణాజలాల్లో 66:34 నిష్పత్తిపై నిరసన తెలిపారు. జలాల మళ్లింపు విషయమై కూడా


మిగితా 2వ పేజీలో

# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు గుండెపోటు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



డెహ్రాడూన్ పర్యటనలో ఉన్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు స్వల్ప గుండెపోటు వచ్చింది. వెంటనే ఆయనను డెహ్రాడూన్‌లో ఉండే ఓ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందజేశారు. వైద్యులు ఆయనకు స్టంట్ వేశారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. అయితే డెహ్రాడూన్ పర్యటనలో పద్మారావు గౌడ్ ఉన్నారు. ఆయనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించి.. పద్మారావు ఆరోగ్యం గురించి వాకబు చేశారు. చికిత్స పొందిన తర్వాత తాను ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నానని కేటీఆర్‌కు పద్మారావు చెప్పారు. తగినంత విశ్రాంతి తీసుకుని మళ్లీ కార్యక్షేత్రంలోకి రావాలని పద్మారావును కేటీఆర్ కోరారు.

# ఓయూలో బీఏ ఆనర్స్ (తెలుగు) కోర్సు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో బీఏ ఆనర్స్ (తెలుగు) నాలుగేండ్ల కోర్సును వచ్చే విద్యాసంవత్సరం (2025–26)లో ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి సమాలోచన చేస్తున్నది. సివిల్ సర్వీసెస్ సాధనే లక్ష్యంగా సిలబస్‌ను రూపకల్పన చేస్తున్నది. ఓయూ ప్రాంగణంలో డిగ్రీ కోర్సులు అందుబాటులో లేవు. అయితే ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులున్నాయి. కానీ ఓయూ ప్రాంగణంలో బీఏ ఆనర్స్ (తెలుగు) కోర్సును ప్రవేశపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. తెలుగుభాషలో ప్రఖ్యాతిగాంచిన నిపుణులు, ప్రముఖులతో బోధన సాగించాలని ఆలోచిస్తున్నారు. ఇందుకోసం కసరత్తు జరుగుతున్నది. రాష్ట్రంలో 2021–22 విద్యాసంవత్సరంలో బీఏ ఆనర్స్ (ఎకనామిక్స్), బీఏ ఆనర్స్ (పొలిటికల్ సైన్స్) కోర్సులను ఓయూ పరిధిలోని నిజాం, కోఠి మహిళ, బేగంపేట మహిళ, సిటీ కాలేజీల్లో ఉన్నత విద్యామండలి, ఓయూ ప్రారంభించాయి. రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీఏ ఆనర్స్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం కోర్సుల్లో ప్రవేశాలను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. దోస్త్ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులకు 97 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు బీఏ ఆనర్స్ (ఎకనామిక్స్), బీఏ ఆనర్స్ (పొలిటికల్ సైన్స్), బీఏ ఆనర్స్ (సోషియాలజీ), బీఏ ఆనర్స్ (హిస్టరీ), బీబీఏ ఆనర్స్ (బిజినెస్ ఇంటెలిజెన్స్ అండ్ అనలిటిక్స్), బీకాం (ఆనర్స్), బీఎస్సీ లైఫ్ సైన్స్ ఆనర్స్ (బయోమెడికల్ సైన్స్), బీఎస్సీ లైఫ్ సైన్స్ ఆనర్స్ (బయోటెక్నాలజీ), బీఎస్సీ ఫిజికల్ సైన్స్ ఆనర్స్ (డాటాసైన్స్), బీఎస్సీ ఫిజికల్ సైన్స్ ఆనర్స్ (కంప్యూటర్ సైన్స్) కోర్సులను చదివేందుకు అవకాశమున్నది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి బీఏ ఆనర్స్ (తెలుగు) కోర్సు కూడా అందుబాటులోకి రానుంది. తెలుగు రాష్ట్రాల నుంచి ముఖ్యంగా తెలంగాణ నుంచి సివిల్ సర్వీసెస్ కోసం సన్నద్ధ మయ్యే విద్యార్థులకు ఇది ఎంతగానో దోహద పడుతుందని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం చెప్పారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే ఉద్దేశంతోనే ఈ కోర్సును ప్రారంభించాలని భావిస్తున్నామని వివరించారు. ఈ కోర్సును ప్రారంభించేందుకు ఓయూతోపాటు సిటీ కాలేజీ కూడా ముందుకొచ్చిందని అన్నారు.

# 71 శాతం నీటివాటా ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ప్రస్తావించినట్టు రాహుల్ బొజ్జా తెలిపారు. 11 ప్రాంతాల్లో గతంలో బోర్డు సూచించిన మేరకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరాం.ఒక సంవత్సరం కోసం ఏర్పాటు చేసుకున్న సర్దుబా టును ఇంకా కొనసాగించడం న్యాయం కాదని చెప్పినట్టు వివరించారు. ఈ విషయమై త్వరలో స్పందిస్తామని ఏపీ ఈఎన్సీ చెప్పినట్టు చెప్పారు. ఇందుకు కేఆర్ఎంబీ చైర్మెన్ అతుల్‌జైన్ స్పందిస్తూ ప్రస్తుతం 66:34 నిష్పత్తి ప్రకారం కొనసాగిస్తామని చెప్పారు. పరిస్థితులను బట్టి వాటా పెంచే ప్రయత్నం చేస్తామని వివరించారు. తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాలను ఉపసంహరించుకోవాలని కోరామని చెప్పారు. ఇందుకు కేఆర్ఎంబీ రెండు నెలల సమయం కోరిందని వివరించారు. తెలంగాణ నదీ జలాల వాటా పెంచేందుకు చైర్మెన్ ఒప్పుకున్నట్టు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని సైతం ప్రస్తావించామన్నారు. డ్యామ్ స్లూయిజ్‌కు మరమ్మతులు చేయిస్తామని బోర్డు చైర్మెన్ చెప్పినట్టు తెలిపారు. తెలంగాణ ప్రతిపాదన 50:50 నిష్పత్తిని అంగీకరించబోమని ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు సమావేశంలో బోర్డుకు చెప్పారు. 66:34 నిష్పత్తి ప్రకారమే కొనసాగించాలని కోరారు. అదే నిష్పత్తిని కొనసాగిస్తూ రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని బోర్డు చైర్మెన్ చెప్పినట్టు మీడియాకు చెప్పారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని ఏపీకి తరలించాలని కోరినట్టు వివరించారు. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థతో మోడల్ స్టడీస్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. ఆ ఫలితాలు వచ్చేవరకు వచ్చే సీజన్‌కు అవసరమయ్యే అత్యవసర మరమ్మతులు చేపడతామని ఈఎన్సీ వివరించారు. అనంతరం బోర్డు నిర్వహణపై కూడా చర్చించారు. ఏపీ, తెలంగాణ గతంలో అనుకున్నట్టుగా వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు.

# చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ప్రియాంకా చోప్రా..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



నటి ప్రియాంకా చోప్రా చిలుకూరు బాలాజీ టెంపుల్‌ను సందర్శించారు. దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సంబంధిత ఫొటోలను ప్రియాంక ఇన్ స్టాలో షేర్ చేశారు. బాలాజీ ఆశీస్సులతో కొత్త జర్నీ మొదలు పెడుతున్నట్టు పోస్ట్‌లో పేర్కొన్నారు.'శ్రీ బాలాజీ ఆశీస్సులతో ఒక కొత్త అధ్యాయం మొదలవుతుంది. మనమందరం మన హృదయాలలో శాంతి, శ్రేయస్సు, సమృద్ధిని పొందుదాం. దేవుడి దయ అనంతం. ఓం నమః నారాయణ' అని ఆమె పోస్ట్‌లో రాసుకొచ్చారు. చివర్లో రామ్ చరణ్ సతీమణి ఉపాసనకు ధన్యవాదాలు తెలిపారు.

# అర్హులందరికీ రేషన్ కార్డు.. ఇందిరమ్మ ఇల్లు..

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణ రావు, దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి చెప్పారు. గతంలో దరఖాస్తులు చేయని వారు గ్రామ సభల్లో అప్లయ్ చేసుకోవాలని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు మంగళవారం నుండి ఈ నెల 24 వరకు జరుగుతున్న గ్రామ సభల నిర్వహణ, ప్రజల స్పందన, నాలుగు పథకాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్ల రూపాయలు వ్యయం అవుతాయని తెలిపారు. దాదాపు పదేండ్ల తర్వాత రాష్ట్రంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నం దున ఈ రెండు పథకాలకు అత్యధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ అనేది నిరంతర ప్రక్రియ అని, గతంలో దరఖాస్తు చేయని వారు ఈ గ్రామ సభలలో ఇవ్వొచ్చని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇప్పటికే వచ్చిన దరఖాస్తు దారుల్లో ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు లేని వారి జాబితా గ్రామ సభలలో తెలపాలని మంత్రులు తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారికి తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు రేషన్ కార్డుల జారీకి అర్హులైన వారి జాబితా ప్రకటించలేదన్నారు. అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అర్హులైన వారిని ప్రకటిస్తామన్నారు. నేడు జరిగిన గ్రామ సభలు విజయవంతంగా జరిగాయని, ఇందుకు జిల్లా కలెక్టర్లను అభినందించారు. ఈ నాలుగు పథకాలకు సంబంధించి స్వీకరించే దరఖాస్తులలో తప్పనిసరిగా దరఖాస్తుదారుల పేరు, ఆధార్ కార్డు నెంబర్, చిరునామా, ఇంటి అడ్రస్ తదితర వివరాలను తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. కాగా, మంగళవారం రాష్ట్రంలో 4098 గ్రామాలలో గ్రామసభలను విజయ వంతంగా నిర్వహించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు.

# గ్రామ సభల్లో రసాభాస

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ప్రజలు నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల లిస్టుల విషయంలో అధికారుల తీరును తప్పుపట్టారు. రేషన్ కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులు చేయలేదని, దరఖాస్తు చేసుకున్న కొత్తవారికి ఇవ్వలేదని ఆరోపించారు. అలాగే, ఇందిరమ్మ ఇండ్లను ఎంత మందికి ఇస్తారని ప్రశ్నించారు. ప్రజలతో పాటు కాంగ్రెస్ నాయకులు కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూరాబాద్ పట్టణంలో 13వ వార్డులో కమిషనర్ సమ్మయ్యను ప్రజలు నిలదీయగా, సింగపూర్, చెల్పూర్లలో ఆర్డీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్యను నిలదీశారు. పట్టణంలోని పలు వార్డుల్లో రేషన్ కార్డుల విషయంలో ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయగా, గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. దీనిపై అధికారులు స్పందిస్తూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, ఇవే ఫైనల్ కాదని, మళ్లీ ఇస్తామని చెప్పారు. నల్లగొండ మండలంలోని ముశంపల్లి, పానగల్‌లో జరిగిన గ్రామసభల్లో స్థానికులు పలు సమస్యలను కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకొచ్చారు. మర్రిగూడలో జరిగిన గ్రామసభలో లబ్ధిదారుల జాబితా ప్రతులను గ్రామస్తులు చింపేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గుర్రాలదండి గ్రామంలో దరఖాస్తులను గ్రామపంచాయతీ కార్యాలయంలో రూ.5కు అమ్మడాన్ని నిలదీశారు. కాంగ్రెస్ లబ్ధిదారుల పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నాయని, మరోసారి గ్రామసభ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేశారు. మోటకొండూరు మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో దరఖాస్తుదారుల జాబితాలో అనర్హుల పేర్లు రావడమేంటని ప్రశ్నించారు.

# నక్సలిజం కొన ఊపిరితో ఉన్నది : అమిత్ షా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్ గఢ్, ఒడిషా బార్డర్లలో మంగళవారం జరిగిన ఎన్ కౌంటర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. నక్సల్ ఫ్రీ ఇండియాలో భాగంగా తమ జవాన్లు కీలక విజయం సాధించారని ఎక్స్ (ట్విట్టర్) లో ట్వీట్ చేశారు. ఒడిషా, ఛత్తీస్ గఢ్ బార్డర్ లో సీఆర్ పీఎఫ్ , ఎస్ఓజీ ఒడిషా , ఛత్తీస్ గఢ్ పోలీసులు చేపట్టిన జాయింట్ ఆపరేషన్ లో 14 మంది నక్సల్స్ ను అంతం చేశారని పేర్కొన్నారు. నక్సల్ ఫ్రీ భారత్ లక్ష్యాన్ని సాధించే క్రమంలో సెక్యూరిటీ బలగాలు చేసిన ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని, నక్సలిజం ఇండియాలో తుది శ్వాస విడిచే పరిస్థితుల్లో ఉందని కామెంట్ చేశారు. భారత్ ను 2026 మార్చి వరకు నక్సల్ ఫ్రీ దేశంగా చూస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పదే పదే ప్రకటిస్తు వస్తున్నారు. అందులో భాగంగా ఇటీవల నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న ఛత్తీస్ గఢ్, తెలంగాణ, ఒడిషా బార్డర్లలో వరుస కూంబింగ్ ఆపరేషన్స్ చేస్తున్నారు. తాజాగా ఒడిషా బార్డర్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో కీలక నేతలతో సహా 14 మంది మావోయిస్టులు మృతి చెందారు.

# సమస్యలకు కేరాఫ్‌గా హైదరాబాద్ : కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రానికి గుండెకాయ అయిన హైదరాబాద్ ఏడాదికాలంగా సమస్యలకు కేరాఫ్‌గా మారిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్. సీఎంగా కేసీఆర్ సారథ్యంలో హైదరాబాద్ సంతోషానికి చిరునామాగా ఉంటే.. నేడు రేవంత్ సర్కార్ పాలనా వైఫల్యంతో సవాలక్ష కష్టాలకు కేరాఫ్ గా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ లోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో ఇవాళ హైదరాబాద్ లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ ప్రజలు ఏడాది కాలంగా నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య ఇబ్బందులను, తాగునీటితోపాటు ఇతర సమస్యలను ఎమ్మెల్యేలు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎండాకాలం రాకముందే అనేక ఏరియాల్లో వాటర్ ట్యాంకర్లు దర్శనమిస్తున్న సంగతిని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా ప్రస్తావించారు.

బీఆర్ఎస్ పాలన హైదరాబాద్ నగరానికి స్వర్ణయుగం అన్న కేటీఆర్, మెట్రో రైలు, సివరేజీ ప్రాజెక్టులు, ఐటీ వృద్ధి, ప్రపంచ స్థాయి ప్రాజెక్టులు నగర రూపురేఖల్ని మార్చి దేశానికే గర్వకారణంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అమలుచేసిన సమగ్రమైన ప్రణాళికలతో హైదరాబాద్ లో శాంతిభద్రతలు చెక్కుచెదరకుండా ఉన్నాయన్న కేటీఆర్, ప్రస్తుత ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని కాపాడాలన్న సోయి కూడా లేకపోవడం దురదృష్టకరం అన్నారు. నియోజక వర్గంలో ఏ కార్యక్రమానికి వెళ్లినా కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న దురావస్థ గురించే హైదరాబాదీలు చెబుతున్నారని ఎమ్మెల్యేలు కేటీఆర్ కు వివరించారు. ప్రధానంగా బస్తీ వాసులు సమస్యల సుడిగుండంలో చిక్కుకుని విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ కూడా హైదరాబాద్ లో అమలుకావడం లేదన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఏడాది కాలంగా హైదరాబాద్ లోని పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయంలో హైదరాబాద్ రూపురేఖల్ని సమూలంగా మార్చిన విషయాన్ని గుర్తు చేశారు. హైదరా బాద్ వాసుల విలువైన సమయాన్ని ఆదా చేసే విధంగా పదేళ్ళ ముందు చూపుతో పెద్ద ఎత్తున ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టామని, కరోనా సమయంలో కూడా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తిచేసి ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను హైదరాబాదీలకు అందుబాటులోకి తెచ్చామ న్నారు. కొత్త రహదారుల నిర్మాణం, లింక్ రోడ్ల నిర్మాణంతో రద్దీ సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల్ని తీర్చి హైదరాబాద్ వాసుల అభిమా నాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సంపాదించుకుందని గుర్తు చేశారు.అయితే ప్రస్తుత ప్రభుత్వానికి తాము నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా చేతకావడం లేదని విమర్శించారు. దెబ్బతిన్న రోడ్లను కనీసం రిపేర్ చేయ కపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యమయ్యాని మండిపడ్డారు. చెత్త సమస్యను పరిష్కరించేందుకు హైదరాబాద్ లో ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆటోల ప్రయోగంతో విప్లవాత్మకమైన ఫలితాలను సాధించగలిగామని చెప్పారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపు..

- అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహించాలి.
- రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతాయని,కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు అనేవి నిరంతర ప్రక్రియ అని, వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకొని వారు సంబంధిత అధికారులకు అందజేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డ్ సభలకు మంగళవారం నుండి శుక్రవారం వరకు శ్రీకారం చుట్టింది.

ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆయా గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డ్ ల్లో మంగళవారం పథకాల కోసం సభలు నిర్వహించగా, తంగళ్ళపల్లి మండలం గండిలచ్చపేటలో నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇంది రమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం జిల్లాలోని ఆయా గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డ్ ల్లో అర్హుల గుర్తింపు సభలు నిర్వహిస్తున్నామని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహిస్తామని,

రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు కు అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని అన్నారు . ఆయా పథకాలు అర్హులైన వారికి అందుతాయని, ఎంపిక పారదర్శకంగా చేపడుతామని అన్నారు.

**-ఉదయం 9 గంటలకు మొదలు..**


రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి, బోయినపల్లి, చందుర్తి, కోనరావుపేట, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట తదితర మండలాల్లోని 75 గ్రామాలు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 4, 5, 6, 8, 9, 16, 17, 18, 19, 28 వార్డ్ ల్లో, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 1, 2, 8, 12, 18, 21, 22, 25 వార్డ్ ల్లో మొదటిరోజు గ్రామ, వార్డ్ సభలు నిర్వహించారు. ఉదయం 9.00 గంటల నుంచి 12.00 గంట వరకు అలాగే మధ్యాహ్నం 01.00 గంటల నుంచి 04.00 గంటల దాకా సభలు చేపట్టారు.



## నేడు రుద్రంగిలో రాష్ట్ర మంత్రుల పర్యటన..

**బలగం టీవీ , సిరిసిల్ల**


రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో నీటిపారుదల శాఖ మంత్రి, పౌరసరఫరాల శాఖ ,కరీంనగర్ ఇంచార్జ్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం రుద్రంగి లో పర్యటించనున్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులు ప్రజాప్రతినిధులు హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మంత్రులు గ్రామ సభలను, అలాగే కథలపూర్ మండలంలోని కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ ను సందర్శించనున్నరు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లా ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ చోటు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీరాం నరేష్ చెక్కుల పంపిణీ చేశారు. ఇందిరమ్మ కాలని గ్రామానికి చెందిన మంచికట్ల శ్యామల యాదగిరి లబ్దిదారు కి అరవై వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్యామ్, గోరింటల రాజమల్లు, పులి రమేష్, కుచన పద్మ, కొండ సరోజన, భోగా రేఖ యువజన కాంగ్రెస్ నాయకులు కుచన సాయి, కొండ శ్రీకాంత్, ఎల్లే అభిసాయి, అడేపు వినయ్, సిరిమల్లె శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## గౌడ సంఘం అధ్యక్షునికి సత్కారం

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలం గండి లచ్చపేట గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బీపేట మల్లయ్య గౌడ్ ను ఫ్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్ శాలువాతో సత్కరిం్చరో. సత్కారం చేసిన ఫ్యాక్స్ డైరెక్టర్ కు గౌడ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పొన్నం శంకర్ గౌడ్,కుక్కల బాలయ్య, పడిగే నారాయణ తదితరులున్నారు.

# చరిత్ర పుటల్లో సాయుధ పోరాటం మహోన్నతమైనది

- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు



**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి 46వ వర్ధంతి సభను మండలంలోని రాళ్లపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రారంభించిన అగ్రగన్యుల్లో కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి ఒకరని తెలంగాణ సాయుధ పోరాటం మూలంగానే నైజాం సర్కార్ తెలంగాణ వదిలి పారిపోయాడని తెలంగాణ సాయుధరైతంగా పోరాటం ప్రపంచ చరిత్రలో లిఖించదగ్గ చరిత్ర.ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటంతోనే తెలంగాణకు స్వేచ్ఛ స్వతంత్ర కలిగిందన్నారు.అంతేకాకుండా బానిసత్వానికి వ్యతిరేకంగా ఎట్టిచాకిరి వ్యతిరేకంగా దోపిడీకి వ్యతిరేకంగా రజాకార్ల నైజాం భూస్వాముల దొరల దోపిడి, జమీందారుల దోపిడీ వ్యతిరేకంగా వందలాది దళాల నిర్మాణం చేసి సాయుధ పోరాటం నడపడం ద్వారానే 3000 గ్రామాలు విముక్తి చేయబడ్డాయి 4,500 మంది దళాలు దళ నాయకులు ఎంతో మంది తెలంగాణ కోసం అమరులయ్యారని, సాయుధ పోరాట త్యాగమూర్తులను త్యాగాలను చరిత్ర స్మరించుకునే విధంగా అమరుల కాంస్య విగ్రహాలను సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరారు.మాదాపూర్ గుట్టల్లో అమరులైనటువంటి 12 మంది సాయుధ పోరాట సభ్యులలో కామ్రేడ్ సింగిరెడ్డి భూపతి రెడ్డి ఒకరని గుర్తించుకోవడానికి సిరిసిల్ల నడిబొడ్డున స్మృతి వనము కాన్సె విగ్రహం ఏర్పాటు చేయాలని,బద్దం ఎల్లారెడ్డి ని కొనియాడుతూ వేలాదిమంది నిర్వాసితులుగా పేదలుగా ఉన్న వాళ్లకు ఇళ్ల స్థలాలు అందజేశారని ఆ వీధికి సిరిసిల్లలోని బివై నగర్ గా నామకరణం చేశారని తెలిపారు. ఈ వర్ధంతి సమావేశంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రారంభించిన పోరాట నాయకుల్లో కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి ఒకరని తెలంగాణ సాయుధ పోరాటం మూలంగానే సాయుధ పోరాటానికి భయపడిన నైజాం సర్కార్ తెలంగాణ వదిలి పారిపోయాడన్నారు.ఈ వర్ధంతి సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ మండల కార్యదర్శి సోమ నాగరాజు, సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షులు సోమ నాగరాజు, రాజేందర్, బాల నర్సు,శంకర్, బాలమల్లు, పోచయ్య, కనకయ్య, బాలమల్లు, రాజేందర్, వెంకట్, గోవింద్, రాయమల్లు,శంకర్, కొమురయ్య,లక్ష్మయ్య, మురళి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించినవారికి బహుమతులు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**



జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాల సందర్భంగా రాజన్నసిరిసిల్లా జిల్లా రవాణాశాఖ వారు తంగళ్లపల్లి మండలం కేసిఆర్ నగర్ నుండి బద్దెనపల్లి ,తంగళ్లపల్లి మీదుగా ఆటోరిక్షా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డ్రైవర్లకు డ్రైవింగ్ లో తీసుకోవలసిన నిబంధనలు తెలుపుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేయెుద్దని,అధికవేగం డ్రైవర్ సీట్ కు ఇరుపక్కల ప్రయాణికులను కూర్చోబెట్టవద్దని, ద్విచక్ర వాహనం నడుపువారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ మరియు కార్ లో ప్రయానించి సీట్ బెల్టు ధరించి ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కీచైన్లు బహుమతిగా అందజేశారు. జిల్లా రవాణా శాఖా అధికారి వి.లక్ష్మన్, మోటారు వాహన తనిఖీ అధికారి జి వంశీదర్,సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి పృధ్వీరాజ్ వర్మ, కానిస్టేబుల్ ప్రశాంత్, హెూం గార్డ్ ఎల్లయ, ఐ.టి.డి.ఙ. ప్రిన్సిపాల్ సిబ్బంది కెసిఆర్ నగర్ ఆటో యూనియన్ అధ్య క్షులు నాగరాజు, వాహన డ్రైవర్లు, ఓనర్లు సుమారు వంద

# బధిర విద్యార్థిని ఉన్నత చదువుకు ప్రభుత్వం అండ

- రూ. లక్ష 40 వేల చెక్కును అందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**




బధిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి,ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన దోమకొండ లహరి, కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు. ఉన్నత విద్యాబ్యాసం చేసేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ విషయం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ దృష్టిలోకి వచ్చింది. దీంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష 40 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం ఆర్ఎఫ్ సహాయం కింద పంపింది. మంగళవారం దోమకొండ లహరికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ చెక్కు అందజేశారు. ఉన్నత విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కూతురు చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, సహకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూకు దోమకొండ లహరి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేటి నుంచి టీ20 ఫైట్

- నేటి నుంచి భారత్-ఇంగ్లాండ్ టీ20 సిరీస్
- కోల్‌కతా వేదికగా జరగనున్న తొలి టీ20 మ్యాచ్







**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా టీ20 ఫార్మాట్ మ్యాచ్‌లకు సిద్ధమైంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా బుధవారం తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. నేడు రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.

ఇప్పటికే సూర్యకుమార్ నేతృత్వంలోని భారత జట్టు.. ఇంగ్లాండ్ జట్టు అక్కడికి చేరుకుని ముమ్మరంగా సాధన చేస్తున్నాయి. గతేడాది టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత కెప్టెన్ రోహిత్, స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీలు ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశారు. దీంతో జట్టు మొత్తం పూర్తిగా కుర్రాళ్లతో నిండిపోయింది. బౌలర్లు ఎవరనేది చూడకుండా బంతి పడటమే ఆలస్యం.. స్టాండ్స్‌లోకి పంపించాలనే లక్ష్యంతో భారత ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. టీ20 ప్రపంచకప్ తర్వాత భారత్ 11 మ్యాచ్‌లు ఆడగా.. అందులో ఏడు సార్లు 200 పైచిలుకు స్కోరు నమోదు చేయడం గమనార్హం.

ఇక టెస్టుల్లోనే బజ్‌బాల్ ఆటతో పరుగుల వరద పారించిన ఇంగ్లాండ్ జట్టు.. టీ20ల్లో అంతకుమించి సత్తాచాటాలని భావిస్తోంది. కేవలం టెస్టులకే కోచ్‌గా ఉన్న మెకల్లమ్ ఇప్పుడు పరిమిత ఓవర్ల జట్టుకు కూడా కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. దీంతో అతడి నేతృత్వంలో ఆ జట్టు ఎలా రాణిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

**బ్యాటింగ్‌కు అనుకూలంగా పిచ్**

తొలి మ్యాచ్ జరిగే కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనుంది. ఇక్కడ పిచ్‌ను నల్లటి నేలతో రెడీ చేస్తారు. ఈ పిచ్‌పై మంచి బౌన్స్ ఉంటుంది. బ్యాట్‌పైకి బంతులు సులువుగా వస్తాయి. అయితే మ్యాచ్ సాగుతున్నా కొద్దీ పిచ్ నెమ్మదిస్తోంది. స్పిన్నర్లకు అనుకూలంగా మారుతోంది. వాతావరణం కూడా పిచ్ స్వభావంపై ప్రభావం చూపనుంది. రాత్రి వేళలో సీమ్ బౌలర్లకు అనుకూలిస్తోంది. తేమ ప్రభావం కూడా ఉండనుంది.ఇక్కడ ఇప్పటి వరకు 12 అంతర్జాతీయ టీ20లు జరగ్గా.. ఏడు సార్లు ఛేజింగ్ టీమ్ గెలవగా.. మరో 5 సార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచాయి. ద్యూ నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

**భారత జట్టు :** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి, రింకూ సింగ్, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, మహమ్మద్ షమీ, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్)

**ఇంగ్లాండ్ జట్టు:**జోస్ బట్లర్ (కెప్టెన్), మార్క్ వుడ్, ఫిల్ సాల్ట్, సాకిబ్ మహమూద్,



# క్వార్టర్స్‌లో ఓడిన బొప్పన్న జోడి

**బలగం టీవి, హైదరాబాద్**

ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ నుంచి బొపన్న జోడి నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో రోహన్ బొపన్న- షుయ్ జాంగ్ జోడి తీవ్రంగా పోరాడినా.. 6-2 4-6 9-11 స్కోరు తేడాతో వైల్డ్ కార్డు ప్లేయర్లు జాన్ పీర్స్-ఒలివియా గాడెక్కి జోడి చేతిలో ఓటమి పాలయ్యారు. కియా ఎరినాలో సుమారు గంటా 8 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్ రసవత్తరంగా సాగింది. దీంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో భారత ఆటగాళ్ల ప్రాతినిధ్యం ముగిసింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత టెన్నిస్ ప్లేయర్లు సుమిత్ నాగల్, డబుల్స్ స్పెషలిస్టు యుకి బాంబ్రి, ఎన్స శ్రీరాం బాలాజీ కూడా ఓటమిపాలై టోర్నీ నుంచి వైదొలిగారు.

బొపన్న-జాంగ్ జోడి.. తొలి సెట్‌ను కైవసం చేసుకున్నది. ఆస్ట్రేలియన్ వైల్డ్ కార్డు జోడిపై సులభంగా ఆ సెట్‌ను గెలుచుకున్నది. కానీ సెకండ్ సెట్‌లో చైనీస్ క్రీడాకారిణి తన సర్వీసు కోల్పోవడంతో.. ప్రత్యర్థులు బలం పుంజుకున్నారు. రెండో సెట్‌ను 4-6 తేడాతో ఆసీస్ జోడి గెలిచింది. ఇక మూడవ సెట్ ఆసక్తికరంగా సాగింది. సూపర్ టైబ్రేకర్ లో రెండు టీంలు ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. సూపర్ టై బ్రేకర్‌లో మొదటి సర్వీసు బొపన్న, జాంగ్ కోల్పోయాయి. ఓ దశలో 3-3కు చేరుకున్నది. మళ్లీ ఓ దశలో ఆసీస్ 7-5 ఆధిక్యాన్ని అందుకున్నది. కానీ 8-8 వద్ద బొపన్న జోడికి మ్యాచ్ పాయింట్ అవకాశం ఉన్నా.. పీర్స్ దాన్ని అడ్డుకున్నాడు.

# ఆర్టీవో కార్యాలయంలో నాగచైతన్య



**బలగం టీవి, హైదరాబాద్**

నటుడు నాగచైతన్య మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో సందడి చేశారు. తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవడానికి ఆర్టీవో కార్యాలయానికి వచ్చారు. రెన్యూవల్ కోసం ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేశ్‌ను కలిశాడు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులు నాగచైతన్యను డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు తెలుసుకుని రెన్యూవల్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైతూను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆర్టీవో కార్యాలయానికి తరలివచ్చారు. నాగచైతన్య ప్రస్తుతం తండేల్ సినిమాలో నటిస్తున్నాడు. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

# నిర్మాత దిల్ రాజు, మైత్రి మూవీ సంస్థపై ఐటీ సోదాలు

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు ఇండ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని 8 చోట్ల ఏకకాలంలో 55 బృందాలు దాడులు నిర్వహించాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఇక దిల్ రాజుతోపాటు శిరీష్ , దిల్ రాజు కూతురు హన్సితా రెడ్డి నివాసాలలో కూడా ఐటి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

ఈ క్రమంలో దిల్ రాజు భార్య తేజస్వినిని అధికారులు బ్యాంక్‌కు తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో తేజస్విని మీడియాతో మాట్లాడుతూ ఉదయం నుంచి ఐటీ సోదాలు జరుగుతున్నాయన్నారు. బ్యాంకు వివరాలు కావాలని అధికారులు అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించామని చెప్పారన్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమేనన్నారు.

**మైత్రి మూవీ సంస్థపై కూడా దాడి..**

మైత్రీ సంస్థ మీద కూడా ఐటి దాడులు జరిగాయి. మైత్రీ నవీన్, సిఇఒ చెర్రీ, మైత్రి సంస్థ భాగస్వాముల ఇళ్లల్లో సోదాలు చేశారు. అధికారులు. మరోవైపు పాపులర్ సింగర్ సునీత భర్త రామ్ వీరపనేని సంస్థ అయిన మ్యాంగో మీడియా సంస్థల్లో కూడా సోదాలు నిర్వహించారు.

# సైఫ్ అలీ ఖాన్ డిశ్చార్జ్



**బలగం టీవి, ముంబై**

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు . గత వారం సైఫ్ ఇంటికి చోరీకి వచ్చిన దుండగుడు నటుడిపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలతో లీలావతి ఆసుపత్రిలో చేరారు సైఫ్ . అక్కడ ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరు రోజుల చికిత్స అనంతరం మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. వారం పాటు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని సైఫ్‌కు వైద్యులు సూచించారు. అదేవిధంగా ఇన్ఫెక్షన్ అవ్వకుండా ఉండేందుకు ఎక్కువమంది ఆయన వద్దకు రాకుండా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

మరోవైపు సైఫ్‌పై దాడి కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ ను శనివారం అర్ధరాత్రి 2.50గంటలకు థానేలోని హిరానంది ప్రాంతంలో అరెస్టు చేసి విచారిస్తున్నారు. విచారణలో భాగంగా క్రైమ్‌సీన్ రీక్రియేషన్ కోసం నిందితుడిని సైఫ్ ఇంటి వద్దకు తీసుకెళ్లారు. నిందితుడి వేలిముద్రలను కూడా తీసుకున్నారు.




# విడుదలకు 'హాంగ్‌కాంగ్ వారియర్స్' సిద్ధం

**బలగం టీవి, హైదరాబాద్**

యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన 'హాంగ్‌కాంగ్ వారియర్స్' చిత్రం ఈ నెల 24న తెలుగులో విడుదలకానుంది. లూయిస్ కూ, సమ్మోకామ్-బో-హంగ్, రిచీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఎన్‌వీఆర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నది. 'శరణార్థిగా హాంగ్‌కాంగ్‌లోకి అడుగుపెట్టిన ఓ యువకుడు తన జీవనం కోసం అక్కడి అండర్‌వరల్డ్ ప్రపంచంలోకి అడుగు పెడతాడు. ఈ నేపథ్యంలో తన మనుగడ కోసం అతను సాగించిన పోరాటమేమిటన్నదే ఈ చిత్ర కథాంశం. హాంగ్‌కాంగ్ సినీ చరిత్రలో వెయ్యి కోట్లు వసూలు చేసి సంచలనం సృష్టించింది. పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది' అని ఎన్‌వీఆర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలిపింది.

# ఫిబ్రవరి 7న 'ఒక పథకం ప్రకారం'



**బలగం టీవి, హైదరాబాద్**

దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ నటించిన్న సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం "ఒక పథకం ప్రకారం". వినోద్ విహాన్ ఫిల్మ్స్ – విహారి సినిమా హౌస్ ప్రై. లిమిటెడ్ బ్యానర్స్ పై గార్లపాటి రమేష్‌తో కలిసి నిర్మిస్తూ వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భాన్ని మీడియా సమావేశంలో సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ "ఇది నా కెరీర్ కి ఎంతో హెల్పయ్యే సినిమా. నాకు కచ్చితంగా కమ్ బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. ఈచిత్ర దర్శకుడు వినోద్ తో నేను 2005 నుంచి ట్రావెల్ చేస్తున్నాను. ఈ చిత్రం ఎవ్వరినీ డిజప్పాయింట్ చేయదు. ఇది నా హామీ. ఇందులో నా పాత్ర స్టోరీని డ్రైవ్ చేస్తుంది" అన్నారు. దర్శకనిర్మాత వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ.. 'నాకు చిన్నప్పటినుంచి తెలుగు సినిమాలన్నా, తెలుగువాళ్లన్నా, తెలుగు పచ్చళ్లన్నా చాలా చాలా ఇష్టం. ఈ చిత్రంలో ప్రతి మూడు నాలుగు సీన్స్ కు ఒక ట్విస్ట్ ఉంటుంది. ఇందులో ఉన్న రెండు పాటలూ కథను ముందుకు తీసుకువెళ్లేలా ఉంటాయి. రెండు పాటలూ సిడ్ శ్రీరామ్ పాడారు. రాజీవ్ రాయ్ సినిమాటోగ్రఫీ, గోపి సుందర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి" అన్నారు.